హైదరాబాద్
5-8-2023
సంపుటి:08
సంచిక: 335
పేజీలు: 4
వెల: రూ.5/-
CEO & Editor : G. PRUDHVIRAJ
RNI NO: TELTEL/2016/73311
www.samasamajam.in

# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

# ఎలక్షన్...యాక్షన్!



## అసెంబ్లీ ఎన్నికల మోడ్‌లోకి ముఖ్యమంత్రి

- అక్టోబర్‌లో షెడ్యూల్ వెలువడే అవకాశం
- ఉండటంతో హ్యాట్రిక్ విజయం కోసం వ్యూహాలు
- వరుసగా కీలక ప్రకటనలు చేస్తున్న సీఎం
- రుణమాఫీ, ఆర్టీసీ విలీనం, పింఛను పెంపు
- ఈ కోవలోనివే.. పథకాల అమలులో వేగం పెంపు
- ఇంకా అమలు కాని పథకాల తక్షణ పూర్తికి చర్యలు
- రైతులు, ఉద్యోగులు సహా ప్రతి వర్గానికీ లబ్ధి
- విపక్షాలకు అస్త్రాలు లేకుండా చేయడమే లక్ష్యం

హైదరాబాద్: భారత్ రాష్ట్ర సమితి అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఎన్నికల కార్యాచరణపై పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించారు. హ్యాట్రిక్ విజయం లక్ష్యంగా వ్యూహాలకు పదును పెడుతున్నారు. రాష్ట్ర శాసనసభకు ఈ ఏడాది చివర్లో ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. అక్టోబర్‌లో షెడ్యూల్ వెలువడే అవకాశం ఉండటంతో ప్రభుత్వ పథకాల అమలులో వేగం పెంచుతున్నారు. కరోనా, ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఇప్పటివరకు అమలు చేయని పలు పథకాలను యుద్ధ ప్రాతిపదికన ప్రజలకు అందజేసేందుకు చర్యలు చేపడుతున్నారు.

రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ స్థితిగతులపై నిశిత పరిశీలనతో ఖరారు చేసుకున్న వ్యూహాలను ఒకటొకటిగా అమలు చేస్తున్నారు. తద్వారా ప్రధాన విపక్ష పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ ఎత్తుగడలకు చెక్ పెట్టాలని, రాబోయే ఎన్నికల్లో పూర్తిస్థాయిలో లబ్ధి పొందాలనే ఆలోచనలో ఉన్నారు. దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న అంశాలతో పాటు విపక్షాలు ఎన్నికల అస్త్రాలుగా ప్రయోగించేందుకు అవకాశమున్న సమస్యలపై వెంటనే స్పందిస్తూ కీలక ప్రకటనలు చేస్తున్నారు. వారిని పూర్తిగా ఆత్మరక్షణలోకి నెట్టేందుకు అన్ని విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఇటీవలి మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయాలు ప్రకటించారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**మార్చి నుంచే ఎలక్షన్ మోడ్**

కేసీఆర్ ఈ ఏడాది మార్చి నుంచే పార్టీ యంత్రాంగాన్ని ఎన్నికల దిశగా సన్నద్ధం చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి

మిగతా 2లో



# రాహుల్‌కు ఊరట

## పరువునష్టం కేసులో జైలుశిక్షపై సుప్రీంకోర్టు స్టే

- మోదీలను దొంగలన్నందుకు రెండేళ్ల జైలుశిక్ష విధించిన సూరత్ కోర్టు
- ఆ తీర్పుకు హైకోర్టు సమర్థన.. రెండు తీర్పులనూ తప్పుబట్టిన సుప్రీంకోర్టు
- గరిష్ఠ శిక్షకు సూరత్ కోర్టు కారణం చెప్పలేదు.. హైకోర్టూ పట్టించుకోలేదు
- తీర్పు వల్లే రాహుల్‌పై వేటు.. దాంతో వయనాడు ప్రజల హక్కులకు భంగం
- ఆయన వ్యాఖ్యలు సరికాదు.. నేతలు ప్రసంగాల్లో జాగ్రత్త వహించాలి: సుప్రీం
- రాహుల్ సభ్యత్వ పునరుద్ధరణపై స్పీకర్‌ను కలిసి విజ్ఞప్తి చేసిన అధిర్ రంజన్
- సత్యమేవ జయతే అన్న సోనియా.. ఈ ఆనందం తాత్కాలికమేనన్న బీజేపీ

న్యూఢిల్లీ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి సూరత్ కోర్టు విధించిన రెండు సంవత్సరాల జైలుశిక్షను సుప్రీంకోర్టు నిలిపివేసింది. 2019లో ఎన్నికల సభలో మోదీ

2లో



# ఫార్మా 'భూమి'రంగ్

- ఐఏఎస్‌లకు సైతం చట్టంలోని ప్రాథమికాంశాలు తెలియవా?
- కోర్టు కేసుల్లో అధికారులు మరీ గుడ్డిగా వ్యవహరిస్తున్నారు..
- వారికి అసలు బాధ్యత ఉందా? బుర్రలు వాడుతున్నారా..?
- అధికారులపై మండిపడిన హైకోర్టు

# వరదలపై రచ్చరచ్చ

- అసెంబ్లీలో శ్రీధర్‌బాబు వర్సెస్ మంత్రులు!
- రాష్ట్రంలో 15 లక్షల ఎకరాల్లో పంట నష్టం
- పరిహారానికి 1,500 కోట్లు అవసరమవుతాయి
- ప్రభుత్వ సాయం ఎందుకూ సరిపోదు: శ్రీధర్‌బాబు
- 3గంటల కరెంటే కాంగ్రెస్ విధానమా?: కేటీఆర్
- చెక్‌డ్యామ్‌లు వద్దనడం విడ్డూరం: హరీశ్‌రావు
- అనని మాటలను ఆపాదిస్తున్నారన్న దుద్దిళ్ల
- వర్షాలు, వరదలకు 139 గ్రామాలు దెబ్బతిన్నాయి
- 419 ఇళ్లు కూలాయి.. 44 మంది మృతి: వేముల
- విద్యారంగ సమస్యలపై భట్టి, హరీశ్ వాగ్వాదం
- గవర్నర్ తిప్పిపంపిన 4 బిల్లులకు మళ్లీ ఆమోదం



2లో



# దుష్ట పాలకుడిపై సమష్టి పోరాటం

- వచ్చే ఎన్నికల్లో చాలా గొడవలు జరుగుతాయి
- రాక్షస పాలన నుంచి రాష్ట్రాన్ని రక్షించాలి
- సీఎం జగన్ నుంచి అధికారాన్ని తప్పించాలి
- పరిస్థితి చూస్తే ముందస్తు ఖాయంలా ఉంది
- సర్వేలు, నివేదికల ఆధారంగా
- ఎన్నికలకెళ్దాం.. నేతలతో పవన్

అమరావతి: "రాష్ట్రంలో ఎన్నికలకు సమయం దగ్గరపడింది. ప్రస్తుత పరిస్థితులు గమనిస్తే ముందస్తు ఎన్నికలు తథ్యంగా కనిపిస్తున్నాయి. వచ్చే ఎన్నికల్లో చాలా

2లో

# రణరంగం!

## చంద్రబాబు పర్యటనలో తీవ్ర ఉద్రిక్తత

2లో



- రెచ్చిపోయిన వైసీపీ కార్యకర్తలు.. తిరగబడిన టీడీపీ శ్రేణులు
- అంగళ్లులో వైసీపీ కార్యకర్తల విధ్వంసం
- చంద్రబాబుపై రాళ్లతో దాడి... ఎన్ఎస్‌జీ రక్షణ
- టీడీపీ కార్యకర్తలపై దాడులు, వాహనాల ధ్వంసం
- పుంగనూరు బైపాస్‌లో మరోసారి హైటెన్షన్
- బాబును అడ్డుకుంటామంటూ రెచ్చగొట్టిన వైసీపీ
- రోడ్‌షో చేసి తీరతామంటూ ద టీడీపీ కార్యకర్తల పట్టు
- అడ్డుకున్న పోలీసులు... ప్రతిఘటించిన కార్యకర్తలు
- లాఠీచార్జి, బాష్పవాయు ప్రయోగంతో భగ్గు
- రాళ్ల దాడి, రెండు పోలీసు వాహనాలకు నిప్పు
- అంగళ్లు, పుంగనూరులో యుద్ధ వాతావరణం
- 13 మంది పోలీసులు, 50 మంది కార్యకర్తలకు గాయాలు




2లో

# సాగుకు 'సహకారం'

- రైతుల కోసం 1964 సహకార చట్టం సవరణ..
- పారదర్శకతకు పెద్దపీట.. డీసీసీబీల్లో ప్రొఫెషనల్స్
- కంప్యూటరైజేషన్, డిజిటలైజేషన్ దిశగా అడుగులు

## సాంపాదకీయం

# రెవెన్యూ శాఖపై ఎందుకీ పగ?

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో వీఆర్?ఏలు, వీఆర్ఓలు గణనీయమైన పాత్రను పోషించారు. ప్రభుత్వ పథకాలను మారుమూల గ్రామాల దాకా చేరవేసే వీరు ఉద్యమ సమయంలో నలభై రెండు రోజుల పాటు సకల జనుల సమ్మెలో పాల్గొని వ్యవస్థలను స్తంభింపచేశారు. ఇప్పుడు ఈ మాటలను గుర్తు చేస్తే రాష్ట్ర పాలకులు చిరాకుపడుతున్నారు. కావలికారు, శేర్‌శింది, మస్కూరి, నీరడి, తోటి తలారి వంటి పేర్లతో పిలువబడుతూ, గౌరవ సూచనగా గ్రామ రెవెన్యూ సహాయకులుగా గుర్తింపు పొందిన వీరు రాష్ట్రం సాధించినప్పుడు ఇరవై మూడు వేల పైచిలుకుగా ఉండేవారు, ఇప్పుడు 20,555మంది ఉన్నారు. మిగతా ఖాళీలన్నీ ఏమైనాయో ఎవరికీ తెలియడం లేదు. జీవో నెం.52 ప్రకారం నియామక ప్రక్రియలో వీరు అదే గ్రామస్థులై ఉండాలి, అక్కడే నివాసం ఉండాలి. ఇలా ఆ గ్రామంపై పూర్తి స్థాయిలో అవగాహన, పట్టు కలిగి ఉన్నవారినే నియమించారు. రెవెన్యూ, నీటిపారుదల, వ్యవసాయ, అర్థగణాంక, ఆరోగ్య, సర్వే, పోలీసు శాఖల అధికారులు, ఇంకా ఇతర వీఐపీలు ఎవరు గ్రామాలలోకి వచ్చినా వీఆర్?ఏలు, వీఆర్ఓలు వారికి సహరించేవారు. వారి అధికారిక అవసరాలను, వారికి అవసరమైన చిన్నచిన్న పనులను వీరే పూర్తి చేసిపెట్టేవారు. వీరి వల్ల ఏ అధికారికైనా కొంత భరోసా ఉండేది. గ్రామానికి సంబంధించిన ప్రాథమిక సమాచారం అంతా వీఆర్ఏల వద్ద ఉంటుందన్న నమ్మకంతో అధికారులు వచ్చేవారు. నేడు తెలంగాణ రాష్ట్రంలో వీఆర్ఏ ఎందుకూ కొరగానివాడైపోయాడు. అసలు వీరిని తొలగించాలన్న ఆలోచన ఎలా వచ్చింది? రెవెన్యూ వ్యవస్థలో వీరిని కూకటివేళ్ళతో సహా పెరికివేయాలనే ఆలోచన ఎవరి ప్రయోజనాలను కాపాడటం కోసం వచ్చింది? అత్యంత పేదలకు రేషన్ దుకాణంలో బియ్యం వచ్చినయి అని సాటింపు వేయటం మొదలుకొని మధ్యతరగతివారికి, ముఖ్యంగా గ్రామాలలోని దళిత, ఆదివాసీలకు ఏ రకమైన కొత్త ప్రభుత్వ పథకాలు వచ్చినా ఆ సమాచారాన్ని చేరవేస్తూ, అందరికీ అందుబాటులో ఉండేవారు. ఇప్పుడు ఈ పని ఎవరు చేస్తారు?

# వరదలపై రచ్చరచ్చ

హైదరాబాద్: రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సంభవించిన వరదలపై అసెంబ్లీలో శుక్రవారం వాడివేడి చర్చ జరిగింది. వరదల కారణంగా జరిగిన పంటనష్టాన్ని కాంగ్రెస్ సభ్యుడు డి.శ్రీధర్‌బాబు సభ దృష్టికి తీసుకురాగా.. మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి ఉచిత విద్యుత్తు అంశాన్ని తెరపైకి తెచ్చారు. పీసీసీ అధ్యక్షుడు 3గంటల ఉచిత విద్యుత్తు చాలునన్నారని ప్రస్తావించారు. అయితే పంటనష్టంపై చర్చ పెట్టి.. మంత్రులు ఉచిత విద్యుత్తుపై మాట్లాడటమేంటని శ్రీధర్‌బాబు మండిపడ్డారు. దీంతో ఈ అంశంపై చర్చ రచ్చరచ్చ అయింది. మరోవైపు విద్య, వైద్య రంగాలపై లఘు చర్చ సందర్భంగా సీఎల్పీ నేత భట్టివిక్రమార్కకు, మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డికి మధ్య వాదోపవాదాలు జరిగాయి. వరదలపై శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో వరదల కారణంగా తీవ్ర నష్టం జరిగిందని, 50 మందికి పైగా మృతి చెందారని, 3వేల ఇళ్లు కూలిపోయాయని అన్నారు. రైతులు తీవ్రంగా నష్టపోయారని, 15 లక్షల ఎకరాల్లో పంటనష్టం జరిగిందని తెలిపారు. ఎకరానికి రూ.10 వేల చొప్పున వేసుకున్నా.. రూ.1,500 కోట్ల పంటనష్టం జరిగిందన్నారు. సీఎం కేసీఆర్ తక్షణ సాయం కింద ప్రకటించిన రూ.500 కోట్లు ఏ మూలకూ సరిపోవన్నారు. దీనిపై మంత్రి కేటీఆర్ జోక్యం చేసుకొని.. శ్రీధర్‌బాబు గాలిమాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్నారని, ఇంకా లెక్కలు పూర్తిగా తేలకముందే ఎలా చెబుతున్నారని ప్రశ్నించారు. రైతులకు 3గంటల ఉచిత విద్యుత్తు చాలునంటూ పీసీసీ అధ్యక్షుడు అమెరికాలో వ్యాఖ్యలు చేశారని, శ్రీ?ధర్‌బాబు సుద్దులు చెప్పేముందు వాళ్ల పార్టీ విధానమేంటో చెప్పాలని అన్నారు. చెక్ డ్యామ్‌ల నిర్మాణం శాస్త్రీయంగా చేపట్టలేదని, పొలాల్లో ఇసుక మేటలు వేయడానికి చెక్‌డ్యామ్‌ల నిర్మాణం లోపభూయిష్టంగా జరగడమే కారణంగా కనిపిస్తోందని, దీనిపై పరిశీలన చేయాలని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు చెప్పగా.. దీనిపై ఆర్థిక మంత్రి హరీశ్‌రావు మాట్లాడారు. "కాంగ్రెస్ నాయకుల వైఖరి విచిత్రంగా ఉంది. వారి అధ్యక్షుడేమో 24 గంటల ఉచిత విద్యుత్తు అవసరం లేదంటారు. శ్రీధర్‌భాబు చెక్‌డ్యామ్‌ల నిర్మాణం వద్దంటున్నారు" అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలను శ్రీధర్‌బాబు తీవ్రంగా తప్పుబట్టారు. ఉచిత విద్యుత్తుపై చర్చ పెడితే మాట్లాడటానికి తాము సిద్ధమని, వరదలపై చర్చ పెట్టి.. మంత్రులు ఉచిత విద్యుత్తుపై మాట్లాడటమేంటని ప్రశ్నించారు. విద్యుత్తుపై చర్చకు హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. శాస్త్రీయంగా లేని చెక్‌డ్యామ్‌లను పరిశీలించాలని తాను అంటే.. చెక్‌డ్యామ్‌లే అవసరంలేదన్నానంటూ అధికార బలంతో మంత్రులు తాను అనని మాటలను ఆపాదిస్తున్నారని తప్పుబట్టారు. పంటల బీమా పథకాలను రాష్ట్రంలో అమలు చేయడంలేదని, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్టపరిహారం రావడంలేదని తెలిపారు. ఇళ్లు కోల్పోయినవారికి డబుల్ బెడ్‌రూం ఇంటితోపాటు రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. "మీకు సమయం లేదు.. మూడు, నాలుగు నెలలే ఉంది. మేం అధికారంలోకి రాగానే అన్ని పనులు పక్కాగా చేస్తాం" అని శ్రీధర్‌బాబు అన్నారు. వరదలపై జరిగిన లఘు చర్చ సందర్భంగా సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సమాధానమిస్తూ.. వర్షాలు, వరదల వల్ల 139 గ్రామాలు దెబ్బతిన్నాయని, 419 ఇళ్లు పూర్తిగా, 7505 ఇళ్లు పాక్షికంగా కూలిపోయాయని తెలిపారు. పూర్తిగా కూలిన ఇళ్లను గృహలక్ష్మి పథకంలో నిర్మిస్తామని, పాక్షికంగా కూలిన ఇళ్లకు తగు సహాయం అందిస్తామని చెప్పారు.

# ఫార్మా 'భూమి'రాంగ్

హైదరాబాద్, ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఫార్మా సిటీ భూ సేకరణలో రాష్ట్ర ప్రభుత్వానికి హైకోరులో భారీ ఎదురుదెబ్బ తగిలింది. భూ సేకరణకు జారీ చేసిన నోటిఫికేషన్లు, అవార్డులు సహా అన్ని ప్రక్రియలను కొట్టివేస్తూ శుక్రవారం సంచలన తీర్పునిచ్చింది. తాజా మార్కెట్ ధరల ప్రకారం ఫార్మా సిటీ భూ సేకరణ ప్రక్రియను మళ్లీ ప్రారంభించాలని స్పష్టం చేసింది. రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మేడిపల్లి, కుర్మిద్ద తదితర గ్రామాల్లో ఫార్మా సిటీ ఏర్పాటు కోసం 1,702 ఎకరాల భూమి సేకరణలో ప్రభుత్వం అన్ని నిబంధనలను ఉల్లంఘిస్తున్నదని.. దానిని పూర్తిగా అడ్డుకోవాలంటూ 259.02 ఎకరాలకు చెందిన రైతులు దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లపై జస్టిస్ ఎం.సుధీర్‌కుమార్ ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా.. భూ సేకరణ చట్టం 2013లోని సెక్షన్ 15(2), 16, 18 తదితరాల్లో పేర్కొన్న నిబంధనలను అధికారులు పాటించలేదని ధర్మాసనం తేల్చి చెప్పింది. దీంతో భూ సేకరణ నోటిఫికేషన్లు, అవార్డు, ఇతర ప్రొసీడింగ్స్‌ను కొట్టివేయక తప్పదం లేదని ప్రకటించింది. భూ సేకరణలో తప్పులు సరిదిద్దుకోకుండా.. అధికారులు గుడ్డిగా కోర్టు కేసుల్లో వాదనలు వినిపిస్తున్నారని, వారు సరిగా వ్యవహరించి ఉంటే మూడేళ్ల సమయం వృథా అయ్యేది కాదని తప్పుబట్టింది.

**అధికారులపై తీవ్రంగా మండిపాటు**

ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా హైదరాబాద్ గ్రీన్ ఫార్మా సిటీ ప్రాజెక్టును చేపట్టిందని తమకు తెలుసని విచారణ సందర్భంగా హైకోర్టు వ్యాఖ్యానించింది. కానీ, ఐఏఎస్ స్థాయి అధికారులకు భూ సేకరణలో ఏయే విధానాలు పాటించాలో కూడా తెలియడం లేదని మండిపడింది. "చట్టంలో పేర్కొన్న ప్రాథమిక అంశాలనూ వారు ఎందుకు అర్థం చేసుకోలేకపోతున్నారనేది ఆశ్చర్యం కలిగిస్తోంది. అధికారులు, జిల్లా కలెక్టర్లు భూ సేకరణ ప్రక్రియలో ఏంచేయాలో పూర్తి మార్గదర్శకాలతో రెవెన్యూ శాఖ (జేఏ అండ్ ఎల్ఏ) స్పెషల్ చీఫ్ సెక్రటరీ 2017లోనే మెమో జారీ చేశారు. దానిని పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. కోర్టులో కేసులు దాఖలైన తర్వాత.. నోటీసులు జారీ అయ్యాక కూడా తప్పులను తెలుసుకోవడం లేదు. ప్రతివాదులైన అధికారులకు అసలు బాధ్యత ఉందా? బుర్రలు ఉపయోగిస్తున్నారా? అని అనుమానం వస్తోంది. తప్పులను కప్పిపుచ్చే ప్రయత్నాలకు బదులు కొంత బాధ్యతాయుతంగా ఉంటే రాష్ట్ర ప్రభుత్వ విలువైన సమయం వృథా అయ్యేది కాదు. కోర్టు కేసుల్లో అధికారుల తీరు చూస్తుంటే ప్రభుత్వ ప్రయోజనాలను కాపాడే, నిర్ణయాలను అమలు చేసే ఉద్దేశం, నిజాయతీ ఉన్నాయా? లేవా? అన్న అనుమానం కలుగుతోంది" అంటూ హైకోర్టు నిప్పులు చెరిగింది. ఫార్మాసిటీ భూ సేకరణ ప్రాథమిక నోటిఫికేషన్ 2017 జూలైలో జారీ అయిందని.. చట్ట విరుద్ధంగా ఉన్నదాని ప్రకారమే ప్రక్రియ కొనసాగిస్తే అప్పటి ధరల ప్రకారం చెల్లింపులు జరిగి పిటిషనర్లకు చాలా నష్టం వాటిల్లుతుందని హైకోర్టు వ్యాఖ్యానించింది.

# రణరంగం!



రాయచోటి/చిత్తూరు: 'సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధభేరి' పేరుతో తెలుగుదేశం అధ్యక్షుడు చంద్రబాబు చేపట్టిన యాత్ర నిజంగానే యుద్ధాన్ని తలపించింది. శుక్రవారం వైసీపీ నేతలు, కార్యకర్తల దాడులు, కవ్వింపులతో రెచ్చిపోయారు. సహనం నశించిన టీడీపీ కార్యకర్తలు ప్రతిదాడులకు దిగారు. దీంతో... అటు అన్నమయ్య జిల్లా అంగళ్లు, ఇటు చిత్తూరు జిల్లా పుంగనూరు శివారులో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. శుక్రవారం చంద్రబాబు చేపట్టిన యాత్ర ములకలచెరువు, బి.కొత్తకోట మండలాల్లో పూర్తి చేసుకుని... కురబలకోట మండలం అంగళ్లు మీదుగా చిత్తూరు జిల్లాలో ప్రవేశించాల్సి ఉంది. అంగళ్లులో ఉదయం నుంచే వైసీపీ అల్లరి మూకలు చంద్రబాబు పర్యటనను అడ్డుకునేందుకు యత్నించాయి. సుమారు 200 మంది వైసీపీ కార్యకర్తలు జెండాలు చేతపట్టుకుని.. బస్టాండు సర్కిల్‌లో బైఠాయించారు. చంద్రబాబుకు వ్యతిరేకంగా నల్ల బెలూన్లు, జెండాలు పట్టుకుని ఆందోళన నిర్వహించారు. వీళ్లను పోలీసులు అడ్డుకోలేదు. పైగా... రోడ్డుపైన ఒక పక్కగా కూర్చోబెట్టి పోలీసులే రక్షణగా నిలబడ్డారు. దీంతో వైసీపీ అల్లరి మూకలు మరింత రెచ్చిపోయారు. తెలుగుదేశం జెండాతో వెళ్తున్న ఒక ద్విచక్ర వాహనదారుడిని దారుణంగా కొట్టారు. మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో చంద్రబాబు కాన్వాయ్ అక్కడికి సమీపించింది. ఇక వైసీపీ కార్యకర్తలు మరింత చెలరేగిపోయారు. కాన్వాయ్ కంటే ముందు వెళ్తున్న టీడీపీ వర్గీయులపై రాళ్లు, కర్రలు, చెప్పులతో దాడికి దిగి విధ్వంసం సృష్టించారు. టీడీపీ కార్యకర్తలు వారిపైకి తిరగబడ్డారు. పోలీసులు రంగంలోకి దిగి... తెలుగుదేశం శ్రేణులపై లాఠీచార్జి చేసి చెదరగొట్టారు. ఇంతలో చంద్రబాబు కాన్వాయ్ అక్కడికి చేరుకుంది. వైసీపీ మూకల రాళ్ల దాడి విషయం తెలిసి.. తాను ప్రయాణిస్తున్న ఓపెన్ టాప్ కారు నుంచి చంద్రబాబు కిందకు దిగి బస్టాండు సర్కిల్‌లోకి వచ్చారు. ఎలక్ట్రానిక్ మీడియా కోసం ఏర్పాటు చేసిన వాహనంలోకి ఎక్కి మాట్లాడారు. చంద్రబాబు మాట్లాడుతున్న సమయంలోనూ వైసీపీ అల్లరి మూకలు రాళ్ల దాడిని ఆపలేదు. పోలీసులు వాళ్లను అడ్డుకునే ప్రయత్నమూ చేయలేదు. ఎన్ఎస్‌జీ కమెండోలు ఆయనకు రక్షణగా నిలిచారు. సుమారు అరగంట పాటు వైసీపీ నాయకులు ఈ దాడికి పాల్పడ్డారు. రాళ్ల దాడిలో పలువురు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, పోలీసులు గాయపడ్డారు. పోలీసుల సంపూర్ణ సహకారంతో వైసీపీ నాయకులకు రెచ్చిపోయారు. ఈ దశలో చంద్రబాబు సహనం కోల్పోయి... 'తరిమి కొట్టండి' అని సూచించారు. దీంతో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తిరగబడి రాళ్లదాడిని ఎదురుకొన్నారు. వైసీపీ అల్లరి మూకలను తరిమేశారు. చంద్రబాబు అక్కడి నుంచి వెళ్లాక వైసీపీ అల్లరిమూకలు మళ్లీ రెచ్చిపోయాయి. కాన్వాయ్‌లో వెనుక వస్తున్న టీడీపీ నాయకుల వాహనాలను ధ్వంసం చేశారు. రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జి కస్తూరి విశ్వనాథ్ నాయుడు వాహనం, మహిళా శక్తి వాహనంతోపాటు మొత్తం ఆరు వాహనాలు ధ్వంసమయ్యాయి. వైసీపీ అల్లరి మూకలు యథేచ్ఛగా రోడ్డుపై విధ్వంసం సృష్టిస్తున్నా.. పోలీసులు కనీసం అడ్డుకునే ప్రయత్నం కూడా చేయలేదు. పలుమార్లు టీడీపీ శ్రేణులపైనే లాఠీచార్జి చేశారు. చంద్రబాబు పుంగనూరు, పలమనేరు మీదుగా చిత్తూరు వచ్చి... పూతలపట్టులో జరిగే బహిరంగ సభలో పాల్గొనాల్సి ఉంది.

# రాహుల్‌కు ఊరట

(మొదటి పేజీ తరువాయి)

ఇంటి పేరును కించపరుస్తూ రాహుల్‌గాంధీ వ్యాఖ్యానాలు చేశారన్న ఆరోపణలపై దాఖలైన క్రిమినల్ పరువునష్టం దావాలో సూరత్ న్యాయస్థానం ఈ శిక్ష విధించింది. కింది కోర్టు తీర్పును నిలిపివేసేందుకు హైకోర్టు నిరాకరించగా, సుప్రీంకోర్టు మాత్రం రాహుల్‌కు ఊరటనిచ్చింది. ఈ కేసులో గరిష్ఠ శిక్ష అయిన రెండు సంవత్సరాల జైలుశిక్ష ఎందుకు విధించాల్సి వచ్చిందో ట్రయల్ కోర్టు సరైన కారణాలు చెప్పలేక పోయిందని సుప్రీంకోర్టు శుక్రవారం తన తీర్పులో వ్యాఖ్యానించింది. రెండు సంవత్సరాల జైలుశిక్ష విధించడం వల్లే రాహుల్‌గాంధీ ఎనిమిదేళ్ల పాటు ఎంపీగా ఉండటానికి అర్హత కోల్పోయారని గుర్తు చేసింది. రెండేళ్ల జైలుశిక్షపై స్టే ఇస్తూనే సుప్రీంకోర్టు రాహుల్ వ్యాఖ్యలు ఏ మాత్రం ఆరోగ్యకరంగా లేవని వ్యాఖ్యానించింది. ప్రజాజీవితంలో ఉండే వ్యక్తులు ప్రసంగాల విషయంలో జాగ్రత్త వహించాలని సూచించింది. గుజరాత్ బీజేపీ ఎమ్మెల్యే వేసిన ఈ కేసులో కింది కోర్టు తీర్పు రాగానే రాహుల్‌గాంధీపై లోక్‌సభ స్పీకర్ అనర్హత వేటు వేశారు. దాంతో ఆయన ప్రస్తుత వర్షాకాల సమావేశాలకు దూరమయ్యారు. తాజా తీర్పుతో రాహుల్‌గాంధీ పార్లమెంటు సమావేశాలకు హాజరయ్యేందుకు మార్గం సుగమం అయ్యింది. ఇప్పటికే పార్టీ లోక్‌సభాపక్ష నేత అధిర్ రంజన్ చౌదరి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసి రాహుల్‌గాంధీ సభ్యత్వాన్ని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు.

జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ పీఎస్ నర్సింహ, జస్టిస్ సంజయ్ కుమార్‌ల త్రిసభ్య ధర్మాసనం శుక్రవారం తన తీర్పులో సూరత్ కోర్టు జడ్జి తీరును తప్పుబట్టింది. ఆయన తన తీర్పులో రాహుల్‌గాంధీని సుప్రీంకోర్టు గతంలో ఇలాంటి అంశంలోనే తీవ్రంగా మందలించిన విషయాన్ని ప్రస్తావించడమే తప్ప ఆ నేరానికి విధించే రెండేళ్ల గరిష్ఠ శిక్షను ఎందుకు విధించాల్సి వచ్చిందో చెప్పలేకపోయారని పేర్కొంది. క్రిమినల్ డిఫమేషన్ నేరానికి జైలుశిక్ష లేదా జరిమానా లేదా రెండూ విధించేందుకు ఐపీసీ అవకాశం ఇస్తున్నప్పటికీ ట్రయల్ కోర్టు జడ్జి అత్యంత తీవ్రమైన శిక్ష విధించేందుకే మొగ్గు చూపారని ధర్మాసనం ప్రస్తావించింది. కింది కోర్టు తీర్పును సమర్థిస్తూ హైకోర్టు 120 పేజీల భారీ తీర్పును ఇచ్చినప్పటికీ కింది కోర్టు రెండేళ్ల తీవ్ర శిక్షకు కారణాలను చూ పని అంశాన్ని ఎక్కడా స్పృశించలేదని గుర్తు చేసింది. కింది కోర్టు రెండేళ్ల గరిష్ఠ శిక్ష విధించడం వల్లే ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని 8(3) నిబంధన కింద రాహుల్‌పై ఎనిమిదేళ్ల అనర్హత వేటు పడిందని పేర్కొంది. శిక్షను రెండేళ్లకు ఒక్క రోజు తగ్గించినా అనర్హత వేటు పడేది కాదని గుర్తు చేసింది. రాహుల్‌పై మోపిన అభియోగం వారెంటు లేకుండా అరెస్టు చేయడానికి వీల్లేనిది(నాన్ కాగ్నిజబుల్), వారెంటుతో అరెస్టు చేసినా బెయిలు ఇచ్చేందుకు అర్హత ఉన్నది, ఇరుపక్షాలకు సమ్మతమైతే కేసు ఉపసంహరణకు కూడా అవకాశం ఉన్నది..

# దుష్ట పాలకుడిపై సమష్టి పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

గొడవలు జరుగుతాయి. జగన్ తన దగ్గర ఉన్న అధికారం అనే దండాన్ని వేరేవాళ్లకి ఇవ్వడానికి ఏ మాత్రం ఇష్టపడే వ్యక్తి కాదు. తన రాజకీయ ఆధిపత్యం వదులుకునే వ్యక్తి కాదు. జనసేన ప్రజా బలంతోనే ఆ అధికారాన్ని చేజిక్కించుకోవాలి. రాష్ట్ర బాగు కోసం జగన్ నుంచి అధికారాన్ని తప్పించాల్సిన అవసరం ఉంది" అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. శుక్రవారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో ఏపీలో కచ్చితంగా జనసేన ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. నాయకుడిగా తన వంతు ప్రయత్నాన్ని త్రికరణ శుద్ధితో చేసుకుంటూ వెళ్తానని చెప్పారు. "ఈ ప్రయాణంలో మార్పు కోసం సమష్టిగా ప్రయాణం చేద్దాం. ఇక నుంచి మంగళగిరి మన నివాస స్థానం. ఆంధ్రప్రదేశ్ నుంచే పవన్ రాజకీయాలు చేస్తాడు. అందరూ ఒక్కటై రాజ్యాంగ హక్కులను బతికించుకోవడానికి పోరడుదాం" అని పవన్ పిలుపునిచ్చారు. "వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకెళతాం. ఈ దఫా 2019 మోడల్‌ను అనుసరించవద్దు. ఈసారి బలమైన రాజకీయ వ్యూహం ఉంటుంది. సర్వేలు, రిపోర్టులు ఎప్పటికప్పుడు తెప్పించుకుని దానికి అనుగుణంగా ముందుకు వెళ్తాం. పార్టీని మరింత పటిష్టం చేసే దిశగా మన ప్రణాళికలుండాలి. పదివేల ఓట్లు తెచ్చుకోలేని వారు కూడా నాయకులు అయిపోవాలని భావిస్తున్నారు. నా పక్కన నిలబడితే ఓట్లు పడవు. నాయకులని ప్రజలు భావిస్తేనే విలువ పెరుగుతుంది. జగన్ అనే దుష్టపాలకుడి మీద సమష్టిగా పోరాడాలి. రాక్షస పాలన నుంచి ఏపీని కాపాడుకుందాం. ఈ సారి రక్షించకపోతే రాష్ట్రాన్ని మర్చిపోవచ్చు.

# ఎలక్షన్.. యాక్షన్!

(మొదటి పేజీ తరువాయి)

కేటీ రామారావుతో పాటు ఇతర మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవిత, మాజీ ఎంపీ వినోద్‌కుమార్ వంటి సుమారు డజను మంది కీలక నేతలకు ఐదారు అసెంబ్లీ నియోజకవర్గాల చొప్పున సమన్వయ బాధ్యతలు అప్పగించారు. క్షేత్ర స్థాయిలో పరిస్థితులను అంచనా వేస్తూ, అనుసరించాల్సిన కార్యాచరణపై నిత్యం దిశా నిర్దేశం చేస్తున్నారు. తాజాగా దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న అంశాలతో పాటు విపక్షాలు ఎన్నికల అస్త్రాలుగా ప్రయోగించేందుకు అవకాశమున్న సమస్యలపై సీఎం శరవేగంగా స్పందిస్తున్నారు. రైతులు, ప్రభుత్వ ఉద్యోగులు, వెనుకబడిన తరగతులు, మైనారిటీలు, హైదరాబాద్ నగర అభివృద్ధి లక్ష్యంగా కొన్ని కీలక నిర్ణయాలు ప్రకటించారు. ముఖ్యమంత్రి ప్రకటించిన రైతు రుణమాఫీని మాస్టర్ స్ట్రోక్‌గా బీఆర్ఎస్ నేతలు అభివర్ణిస్తున్నారు.

# సాగుకు 'సహకారం'

అమరావతి: సహకార రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చి ఆప్కాబ్‌ను నిలబెట్టిన ఘనత దివంగత వైఎస్సార్‌కే దక్కుతుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. వైద్యనాథన్ సిఫార్సులను ఆమోదించి సహకార పరపతి వ్యవస్థ బలోపేతం కోసం రూ.1,850 కోట్లు ఇచ్చిన తొలి రాష్ట్రంగా ఉమ్మడి ఏపీకి వైఎస్సార్ గుర్తింపు తెచ్చారుని చెప్పారు. ఆప్కాబ్ (ద ఏపీ స్టేట్ కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్) ఏర్పడి 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం విజయవాడలోని ఏ కన్వెన్షన్‌లో నిర్వహించిన వజ్రోత్సవ వేడుకలకు సీఎం జగన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆప్కాబ్ నూతన లోగో, ఆప్కాబ్ బ్రాండ్ ఐడెంటిటీ గైడ్‌లైన్స్ (బీఐజీ) బిగ్ విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించారు. డీసీసీబీలకు రూ.55.93 కోట్ల డివిడెండ్‌ను పంపిణీ చేశారు. అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన డీసీసీబీలు, పీఏసీఎస్, బ్రాంచ్‌లు, ఉద్యోగులకు అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఏమన్నారంటే... ఆప్కాబ్ షష్టి పూర్తి సందర్భంగా సహకార రంగ చరిత్రలో ఈ రోజుకు ఎంతో ప్రత్యేకత ఉంది. రైతులకు అండగా నిలుస్తూ బ్యాంకింగ్ సేవలతో ఆప్కాబ్ 60 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని నిలబడిన పరిస్థితి చూస్తే చాలా గొప్పగా ఉంది. బ్యాంకును ఈ స్థాయికి తెచ్చేందుకు కృషి చేసిన యాజమాన్యానికి, బ్యాంకు కార్యకలాపాల్లో పాలు పంచుకుంటున్న ప్రతి ఒక్కరికీ అభినందనలు. మన దేశంలో రైతు అప్పుల్లోనే పుడతాడు.. అప్పుల్లోనే పెరుగుతాడు.. అప్పుల్లోనే చనిపోతారని ఒకప్పుడు నానుడి ఉండేది. దీనికి కారణం విత్తనం నుంచి పంట కోత వరకు అన్నింటికీ పెట్టుబడి అవసరం. అందుకోసం రైతన్నలు అప్పులు చేయాల్సిన పరిస్థితి. ఆ అప్పులకు వడ్డీలు కట్టలేక రైతన్నలు అవస్థలు పడుతున్న పరిస్థితుల వల్ల ఈ నానుడి వచ్చింది. అప్పుడు.. విప్లవంలా ఒక మార్పు జరిగింది. అదేమిటంటే.. ఎప్పుడైతే రైతులకు దగ్గరగా బ్యాంకింగ్ వ్యవస్థ అడుగులు వేసిందో అప్పుడు తక్కువ వడ్డీకే రుణాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ ఒక్క మార్పుతో వ్యవసాయంలో రైతన్నలు నిలదొక్కుకునే పరిస్థితి వచ్చింది. ఈ మార్పును మరింత ముందుకు తీసుకెళ్తూ మన రాష్ట్రంలో ఆప్కాబ్ అనే కోపరేటివ్ బ్యాంకు వచ్చింది. ఒక చారిత్రక అవసరంతో ఏర్పడ్డ ఈ బ్యాంకు రైతన్నలను చేయి పట్టుకుని నడిపించింది. ఈ క్రమంలో ఎన్నో ఒడిదుడుకులు, ఇబ్బందికర పరిస్థితులను చవి చూసింది. ఆప్కాబ్‌ను మెరుగైన స్థితికి చేర్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేసే బాధ్యతను 2019 అక్టోబర్‌లో నాబార్డ్ కన్సల్టెన్సీ సర్వీస్ నాబ్‌కాన్స్‌కు అప్పగించాం. వారు ప్రతి బ్యాంకుకూ వెళ్లి ఏడాది పాటు క్షుణ్ణంగా అధ్యయనం అనంతరం కొన్ని సూచనలు, సలహాలు అందించారు.

# ఐటీ టవర్ పనులు వేగవంతం చేయాలి

**అధికారులను ఆదేశించిన కలెక్టర్**



**నల్గొండ,,(సమ సమాజం):** పట్టణం లో నిర్మాణం లో ఐటీ టవర్ పనులు వేగవంతం చేసి సెప్టెంబర్ రెండవ వారం నాటికి పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధంగా ఉంచాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ అర్.వి.కర్ణన్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ నల్లగొండ మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చర్లపల్లిలో ని అర్బన్ పార్కులో విస్తృతంగా మొక్కలు నాటాలన్నారు. ఇరిగేషన్ శాఖ వారితో చర్చించి నీరు నిలిచే చోట నీటికొలను లాగా ఏర్పాటు చేయాలని అన్నారు. మర్రిగూడ బైపాస్ జంక్షన్ ను పరిశీలించి చౌరస్తాలోని పోల్ వద్ద చెడిపోయిన విగ్రహం స్థానంలో కొత్తది ఏర్పాటు చేయాలన్నారు. నిర్మాణంలో ఉన్న ఫ్లై ఓవర్ కు బడ్జెట్ ఎంత, ఎన్ని రోజులలో ఇది పూర్తవుతుందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఐటీ టవర్ నిర్మాణంలో భాగంగా మౌలిక సదుపాయాల కల్పన కోసం నీటి సౌకర్యం, విద్యుత్తు, ఇంటర్నెట్ కనెక్షన్లను వెంటనే,బస్ బే ఐ.టి.టవర్ ను ఆనుకుని పాలిటెక్నిక్ కళాశాల వరకు కెనాల్ ను సుందరీకరణ చేయాలని ఆయన సూచించారు. అనంతరము బీట్ మార్కెట్లోని ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్ వెజ్ మార్కెట్ ను పరిశీలించి నీటి సదుపాయం విద్యుత్ సౌకర్యం మొదలగు మౌలిక సౌకర్యాలు పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా మహిళలకు పురుషులకు వేరువేరుగా టాయిలెట్లు ఏర్పాటు చేయాలన్నారు. అంతేగాక శిథిలావస్థలో ఉన్న కట్టడాలు గోడలను వెంటనే తొలగించాలన్నారు. జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో పురపాలక శాఖ ద్వారా ఏర్పాటుచేసిన పట్టణ నిరాశ్రయుల వసతి కేంద్ర భవనంను కలెక్టర్ తనిఖీ చేశారు. డార్మిటరీ గదులు, టాయి లేట్ లు పరిశీలించారు. పట్టణం లో నిరాశ్రయులు ఎంత మంది ఉన్నారు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, మున్సిపల్ కమిషనర్ డా.కె.వి.రమణాచారి, పబ్లిక్ హెల్త్ ఈఈ సత్య నారాయణ, మున్సిపల్ ఇంజనీర్ లు తదితరులు పాల్గొన్నారు.

# మన దేశ సంపదాన్ని పెంచిన వారి ఈ యాదవులు

**జహీరాబాద్ ,(సమ సమాజం):** పశుపాలకులను ప్రజా పాలనలో భాగస్వామ్యం చేయడమే గొర్రె కాపరుల సంఘం పనిచేస్తుందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి శ్రీహరి యాదవ్ అన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ లో గొర్రె కాపరుల సంక్షేమ సంఘం జిల్లా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా నూతన కార్యవర్గాన్ని నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గొర్రె కాపర్ల సంక్షేమం కోసం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థిక అభివృద్ధి సాధించాలని రాష్ట్ర అధ్యక్షుడు శ్రీహరి యాదవ్ పిలుపు నిచ్చారు. అర్హులకు అన్యాయం జరగకుండా.. అనరులకు లబ్ధి చేకూరకుండా గొర్రె కాపరుల సంఘాలు సంక్షేమ పథకాలను పర్యవేక్షించాలని నిర్ణయించారు. రానున్న రోజుల్లో నియోజకవర్గం, మండల స్థాయి కమిటీలను బలోపేతం చేసి పథకాలు పూర్తిస్థాయిలో అందేలా చూస్తామని ఈ సందర్భంగా ప్రకటించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు పోచబోయిన శ్రీహరి యాదవ్, రాజు యాదవ్, ధనసిరి మల్లేశం, సత్యనారాయణ, విశ్వనాథ్ యాదవ్, లక్ష్మణ్ యాదవ్,నరసింహులు రాములు, నాగరాజు, రాజ్ కుమార్ కోహిర్ యాదయ్య మల్లేశం గొర్రెల కాపలా సంక్షేమ సంఘ సభ్యులు పాల్గొన్నారు

# వైద్య ఆరోగ్య శాఖ, ఐ.సి.డి.ఎస్.సిబ్బంది కలిసి సమన్వయంతో పని చేయాలి

**నల్గొండ,,(సమ సమాజం):** వైద్య ఆరోగ్య శాఖ, ఐ.సి.డి.ఎస్ సిబ్బంది, సి.డి.పి. ఓ.లు, సూపర్ వైజర్ లు, అంగన్ వాడి టీచర్ లు, వర్కర్ లు, హెచ్.సి.డాక్టర్ లు, సిబ్బంది సమన్వయం తో పని చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్.వి కర్ణన్ అన్నారు. పి.హెచ్.సి.డాక్టర్ లు, సిబ్బంది సమర్థ్వంతంగా పనిచేస్తూ వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అర్.వి. కర్ణన్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం లో ఉదయాదిత్య భవన్ లో వైద్య ఆరోగ్య శాఖ పి.హెచ్.సి డాక్టర్ లు, అంగన్ వాడి సి.డి.పి. ఓ.లు, సూపర్వైజర్ లతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డెంగ్యూ కేసులు గురించి తెలుసుకున్నారు.డెంగ్యూ వచ్చిన వెంటనే వారికి చికిత్స అందించడమే కాక డెంగ్యూ కేస్ వచ్చిన ఇంటి పరిసరాల లోని 100 గృహాల వరకు డెంగ్యూ నివారణ,దోమల లార్వా నియంత్రణకు అంటి లార్వా ఆపరేషన్ స్ప్రేయింగ్,ఫాగింగ్,నీటి నిల్వ లేకుండా స్థానిక పంచాయతీ,మున్సిపల్ సిబ్బంది సమన్వయం తో వైద్య ఆరోగ్యశాఖ, ఐ.సి.డి.ఎస్ అంగన్ వాడి సిబ్బంది చర్యలు చేపట్టాలని అన్నారు.పి.హెచ్.సి.లలో హెల్త్ వెల్ నెస్ సెంటర్ లకు సరఫరా చేసిన డెంగ్యూ రాపిడ్ టెస్ట్ కిట్ లు ఉపయోగించాలని,జ్వరం కేసులు వచ్చిన డెంగ్యూ రాపిడ్ టెస్ట్ కిట్ తో రక్త పరీక్ష చేయాలని అన్నారు.ప్రతి వారం రిపోర్ట్ ఇవ్వాలని అన్నారు డెంగ్యూ నిర్ధారణ అయితే ప్రకటించకుండా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి లోని టి.హబ్ కి పంపి డెంగ్యూ పాజిటివ్ నిర్ధారణ అయితేనే పాజిటివ్ గా ప్రకటించాలని అన్నారు. ప్రైవేట్ డయాగ్న స్టిక్ సెంటర్ లు కూడా డెంగ్యూ నిర్ధారణ అయితే ప్రకటించ వద్దని,టి.హబ్ కు శాంపిల్ పంపించాలని,టి.హబ్ లో నిర్ధారణ అయితే ప్రకటించాలని అన్నారు. డెంగ్యూ వ్యాధి నిర్ధారణకు ప్రత్యేకంగా 24 గంటలు పని చేసేలా ల్యాబ్ ఏర్పాటు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డ యాగ్న స్టిక్ సెంటర్ లతో సమావేశం ఏర్పాటు చేసి తెలుపాలని అన్నారు. సీజనల్ వ్యాధులు టైఫాయిడ్,డయేరియా,వ్యాధుల నివారణకు అవసరమైన మందుల కిట్ అన్ని పి.హెచ్.సి.లలో ఉండాలని అన్నారు. పి.హెచ్.సి డాక్టర్ కు ఎం.పి.డి. ఓ లతో మండల స్థాయి సమావేశం నిర్వహించి డెంగ్యూ సీజనల్ వ్యాధుల వ్యాప్తి నివారణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. హెల్త్ వెల్నెస్ సెంటర్ లు ఉన్న పి.హెచ్.సి.లలో ఉన్న ఆయుష్ డాక్టర్ లు పి.హెచ్.సి.డాక్టర్ లతో కలిసి పని చేయాలని,రోగులను ఓ.పి.లో విధులు నిర్వర్తించాలని అన్నారు. పి.హెచ్.సి.లలో ఏ.ఎన్.సి రిజిస్ట్రేషన్ లు, అనీమియా లోపం ఉన్న గర్భిణీలకు తగు చికిత్స అందించాలని అన్నారు.

# రైతు ఋణమాఫీ ప్రకటించినందుకు సి యం కె సి ఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన ముద్దగౌని రామ్మోహన్ గౌడ్ మరియు మాజీ కార్పొరేటర్ల.

**ఎల్బీనగర్ ,(సమ సమాజం):** ముఖ్యమంత్రి వర్యులు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గత ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు రైతులు తీసుకున్న పంట రుణాలను ఒక లక్ష రూపాయల వరకు మాఫీ చేస్తామని ప్రకటించడంతో ఈ రోజు ఉదయం బి ఎన్ రెడ్డి నగర్ మాజీ కార్పొరేటర్ మతి ముద్దగౌని లక్ష్మి ప్రసన్న రామ్మోహన్ గౌడ్ ఆధ్వర్యంలో వనస్థలిపురం రైతు బజార్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎల్బీనగర్ నియోజకవర్గం బి ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జి శ్రీ ముద్దగౌని రామ్మోహన్ గౌడ్ , కొత్తపేట మాజీ కార్పొరేటర్ వజీర్ ప్రకాష్ గౌడ్ , చంపాపేట మాజీ కార్పొరేటర్ సామ రమణా రెడ్డి , చైతన్యపురి మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్ రెడ్డి , గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ కత్తుల రాంబాబు ముఖ్య అతిథులుగా పాల్గొని రైతు బజార్ లోని రైతులతో కలిసి మన ప్రియతమ ముఖ్యమంత్రి వర్యులు కల్వకుంట్ల చంద్ర శేఖర్ రావు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. తదుపరి రైతుబజార్ లో కూరగాయలు అమ్ముకునే రైతులకు స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా రామ్మోహన్ గౌడ్ మాట్లాడుతూ మన గౌరవ ముఖ్యమంత్రి వర్యులు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గత ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు రైతులు తీసుకున్న పంట రుణాలను ఒక లక్ష రూపాయల వరకు మాఫీ చేస్తామని ప్రకటించడంతో దీని వలన 29. 61 లక్షల కుటుంబాలకు లబ్ది చేకూరేవిధంగా సుమారుగా 19 వేల కోట్ల రూపాయలు మేరకు మాఫీ అవుతున్నాయని ,



అకాల వర్షాలతో రైతులు పంటలు సరిగా నష్టపోతుండటంతో రుణమాఫీ చేయడం హర్షణీయమని, ఇప్పటికే ప్రభుత్వం ఉచిత విద్యుత్, దళిత బందు, మైనారిటీలకు మరియు బి సి లకు ఒక లక్ష రూపాయల ఆర్థిక సహాయం, కల్యాణ లక్ష్మీ , షాదీముబారక్ వంటి పథకాలు పేదలకు అందుతున్నాయని , మన సి యం రైతుల పక్షపాతి అని, పేద బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు చంద్రయ్య , శ్రీనివాస రెడ్డి , ఉదయ్ రెడ్డి , లింగమ్మ , అనిత , ఉపేందర్ రెడ్డి , యాదమ్మ , నగేష్ బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు నక్క వెంకట స్వామి యాదవ్, మెట్టు వెంకట్ రెడ్డి , పవన్, గట్టు శ్రీనివాస్ , మహ్మద్ , నాగరాజు గౌడ్, చంద్రకాంత్ గౌడ్, సుదర్శన్ రెడ్డి, రమణా రెడ్డి , తిరుమల రెడ్డి , యాది ముదిరాజ్, సంతోష్ గౌడ్ , కోటేష్, జువ్వగాని రాజు గౌడ్, కృష్ణ గుప్తా, రామ లక్ష్మణ్, సిలుమర్తి శేఖర్ , పారంద స్వామి , అంజి రెడ్డి, హరి గౌడ్, వెంకటేష్ , ప్రవీణ్ గౌడ్ , రమణ గౌడ్, శ్రీధర్ , వెంకటేష్ గౌడ్ , రవి చందర్ , అంజయ్య , శ్రీను, సామ సాయి , శాండీ , భాను , అభి, గుమ్మడివెల్లి సాయి కిరణ్, పార్వతి, స్వప్న , హరి ప్రసాద్ , రమణ , నాగరాజు ముదిరాజ్, హరి గౌడ్, కావేటి రాజశేఖర్ , నరసింహా గౌడ్ , జగన్ , వెంకట్ , ఆఫ్రిద్ , సమీర్ , సునీల్, సన్నీ , విజయ , రామ లక్ష్మి , శశికళ, లీలావతి , ప్రసన్న , నాగలక్ష్మి , కళ్యాణి తదితరులున్నారు.

# మోడీ నియంతృత్వ పాలనకు సుప్రీం కోర్టు తీర్పు చెంప పెట్టు.

- జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు టి విజయలక్ష్మి
- సుప్రీం కోర్టు తీర్పు పై కాంగ్రెస్ శ్రేణులు హర్షం.



**జగిత్యాల, (సమ సమాజం):** రాహుల్ గాంధీ సభ్యత్వ రద్దు పై సుప్రీంకోర్టు స్టే ఇవ్వడం పై జగిత్యాల పట్టణంలో కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు చేసుకున్నారు. జగిత్యాల జిల్లా కేంద్రం లో జిల్లా మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు తాటి పర్తి విజయ లక్ష్మి దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో టపాసులు పేల్చి సంబురాలు చేసుకున్నారు.రాహుల్ గాంధీ కి అనుకూలంగా నినాదాలు చేశారు. ప్రశ్నించే వారిని అనగద్రొక్కే కేంద్ర ప్రభుత్వ వైఖరి పై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.అనంతరం విజయ లక్ష్మి దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ భారత్ జో డో యాత్ర తో కన్యా కుమారి నుండి కాశ్మీర్ వరకు భారత జాతిని ఏకం చేసేందుకు రాహుల్ గాంధీ యాత్ర చేపడితే యాత్ర కు వచ్చిన అపూర్వ స్పందన, ప్రజల్లో రాహుల్ గాంధీకి పెరుగుతున్న ఆదరణ ఓర్వలేక, మోడీ పాలనలో అవినీతి ని ప్రశ్నించినందుకు వేటు వేసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తే, సుప్రీంకోర్టు మోడీ నియంతృత్వ పాలనకు చెంప పెట్టు లాంటి తీర్పు ఇచ్చి, ప్రజాస్వామ్యన్ని పరి రక్షించిందని విజయలక్ష్మి అన్నారు.మోడీ పాలనలో అవినీతి, అక్రమాలను నిలదీస్తే అధికారాన్ని అడ్డుగా పెట్టుకొని, ప్రశ్నించే గొంతు అణచి వేస్తున్నారని విజయలక్ష్మి మండిపడ్డారు.రాహుల్ గాంధీ పై బిజెపి కుట్ర పూరిత కేసులు పెట్టిందని ఆమె తెలిపారు.సుప్రీం కోర్టు కు కాంగ్రెస్ శ్రేణులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కల్లేపల్లి దుర్గయ్య, గుండా మధు, గాజుల రాజేందర్, మొజొద్దిన్, బీరం రాజేశం, నేహాల్, చాంద్ పాషా, రమేష్ రావు, కమటల శ్రీనివాస్, పుప్పాల అశోక్, అజార్,రజనీ కాంత్, మొహమ్మద్ హాబీబ్, మారు గంగారెడ్డి, రాధా కిషన్,చిట్ల అంజన్న, సావాన్ తోట నరేష్, రోహిద్, సిరాజ్, ప్రదీప్,జమీల్,భార్గవ్ పాల్గొన్నారు.

# మద్దిరాల మండల కేంద్రంలో వార్షిక కార్మికుల అక్రమ అరెస్ట్.

**మద్దిరాల ,(సమ సమాజం):** గత 30 రోజులుగా గ్రామపంచాయతీ కార్మిక సిబ్బంది తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ సమ్మె చేస్తున్నారు. ఈరోజు తమ న్యాయమైన డిమాండ్ల కోసం పంచాయతీరాజ్ శాఖ మంత్రి ని కలవడానికి కార్యచరణ రూపొందించుకోగా పోలీసులు వారిని ముందస్తు అరెస్టు చేశారు. అరెస్టును ఉద్దేశించి కార్మిక సంఘాల జేఏసీ నాయకుడు గంట నాగర్జున మాట్లాడుతూ గత 30 రోజుల నుంచి ప్రభుత్వానికి తెలియజేసినప్పటికీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు ఉందని అన్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు వెట్టిచాకిరి చేస్తే మాకు దినసరి వేతనం కనీసం 300 రూపాయలు కూడా లేదని అన్నారు. మా న్యాయమైన డిమాండ్లను నెరవేర్చకుండా మమ్మల్ని అక్రమంగా అరెస్టు చేయడం ఏమైనా చర్యని అభివర్ణించారు. %ూ=జ. +శీ అశీ%.60 ప్రకారం కనీస వేతనం 19000 అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా సమ్మెను విచ్ఛిన్నం చేసే ప్రయత్నం చేస్తే మరింత ఉధృతంగా చేస్తామని ఆయన అన్నారు. న్యాయమైన డిమాండ్ల సాధనలో ప్రభుత్వం ముందుకు వచ్చి జేఏసీ సంఘాలతో చర్చించి సమస్యను పరిష్కరించాలని, వెంటనే ఈ అక్రమ అరెస్టులను ఆపాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో కొడిశాల లింగయ్య, రాంపాక సుధాకర్, రాంపాక దామోదర్, పాల్వాయి పాపయ్య రాఘవ రాజు తదితరులు పాల్గొన్నారు.

# వరద బాధితులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలి:సిపిఎం

**-సిపిఎం ఆధ్వర్యంలో విరాళాల సేకరణ**



**నాంపల్లి,(సమ సమాజం):** వరద బాధితులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని నాంపల్లి సిపిఎం మండల కార్యదర్శి నాంపల్లి చంద్రమౌళి అన్నారు. శుక్రవారం నాంపల్లి మండల కేంద్రంలో వరద బాధితుల కోసం సిపిఎం ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వరద సాయం కింద రూ.2వేల కోట్లకు పెంచాలని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం వరద బాధితులను ఆదుకోవాలనీ అన్నారు. వరద నష్టానికి క్యాబినెట్లో ప్రకటించిన రూ .5 వందల కోట్లు ఏ మూలకు సరిపోవనీ వారు అన్నారు. జాతీయ విపత్తు నిధులు విడుదల అయ్యేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలనీ అన్నారు.అదేవిధంగా వరద బాధితుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ఆదుకోవాలనీ అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు కోమ్ము లక్ష్మయ్య, వాసిపాక ముత్తిలింగం, సైదులు తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ లో అరెస్ట్ అయిన నేషనల్ హెల్త్ మిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామా రాజేష్ ఖన్నా

**వరంగల్ ,(సమ సమాజం):**కరోనా కష్టకాలంలో ప్రజల ప్రాణాలు నిలపటానికి మా ప్రాణాలను ఎదురు వడ్డీ కష్టపడినా! మాకు తెలంగాణ ప్రభుత్వం అరెస్టులను బహుమానంగా ఇచ్చిందని, గత 23 సంవత్సరాలుగా కాంట్రాక్ట్ బేసిస్ లో పనిచేస్తున్న ఎన్.హెచ్.ఎం. అల్ క్యాడర్ ఉద్యోగులను అందరిని ఎటువంటి పరీక్షలు లేకుండా రెగ్యులర్ చేయాలని, తమ పోరాటాన్ని పట్టించుకోకపోగా ఎన్.హెచ్.ఎం.స్కీం లో అందరిని భేషరతుగా రెగ్యురేషన్ చేయాలని అసెంబ్లీ ముట్టడి సెకండ్ ఏఎన్ఎం కార్యక్రమానికి వెళుతున్న సెకండ్ ఏఎన్ఎంలను అరెస్ట్ చేయాలి కానీ, ఎన్.హెచ్.ఎం. అల్ క్యాడర్ ఉద్యోగులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ తరలించటం దారుణమని అన్నారు. ఎన్.హెచ్.ఎం.అల్ క్యాడర్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని అరెస్టయినా ఎన్.హెచ్.ఎం అల్ క్యాడర్ ఉద్యోగులను బేషరతుగా విడుదల చేయాలని, వారిపై ఎటువంటి కేసులు నమోదు చ ే య ు ం వ ద ్ద ని ఎన్.హెచ్.ఎం.రాష్ట్ర జనరల్ సెక్రటరీ రామా రాజేష్ ఖన్నా ప్రభుత్వానికి పోలీసులకు విజ్ఞప్తి చేశారు. ఈ రోజు అరెస్ట్ అయిన వారి లో ఎన్.హెచ్.ఎం. స్కీం స్టాఫ్ నర్స్ లు, ఫార్మసీస్ట్, టీ.బీ.సూపెర్వైసోర్, ల్యాబ్ టెక్నీషియన్, ఓ.టీ.టెక్నీషియన్, డేటా ఎంట్రీ ఒపేరాతోర్స్, అకౌంటెంట్, ఎం.ఎన్.ఓ.లు, వాచ్ మెన్, స్వీపర్, ల్యాబ్ అటెండర్, డ్రైవర్ ఉన్నారు. మిల్స్ కాలనీ



పోలీస్ స్టేషన్ లో అరెస్టు అయిన వారిలో ఎన్.హెచ్.ఎం.ఎంప్లాయిస్ మిస్బ హ ఉర్ రెహమాన్, ముజాహిద్ అలీ, అరుణోదయ, తిరనాహరి వెంకట శ్రీనివాస్, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

# రెండో టీ20లో అవకాశం దక్కుతుందా?



వెస్టిండీస్‌తో తొలి టీ20లో భారత జట్టు చిత్తుగా ఓడింది. ఈ మ్యాచ్‌లో టీమిండియా బ్యాటర్లలో తిలక్ వర్మ మినహా ఎవరూ పెద్దగా రాణించలేదు. ముఖ్యంగా మంచి ఫామ్‌లో ఉన్న బ్యాటర్లు కూడా తేలిపోవడం జట్టును దెబ్బతీసింది. ఇలా ఈ మ్యాచులో విఫలమైన ముగ్గురు కీలక ఆటగాళ్లు ఎవరో చూస్తే..

**శుభ్‌మన్ గిల్**

టీమిండియా ఓపెనర్‌గా తన స్థానం పదిలం చేసుకున్న యువ ప్లేయర్ శుభ్‌మన్ గిల్. విండీస్‌తో జరిగిన మూడో వన్డేలో అతను రాణించాడు. దీంతో తొలి టీ20లో గిల్‌పై ఫ్యాన్స్ చాలా ఆశలు పెట్టుకున్నారు. కానీ ఈ మ్యాచ్‌లో అతను చాలా దారుణంగా ఫెయిలయ్యాడు. కేవలం మూడు పరుగులే చేసి పెవిలియన్ చేరాడు. ముఖ్యంగా తను చివరగా ఆడిన టీ20 మ్యాచులో గిల్ సెంచరీతో చెలరేగాడు. దీంతో అతనిపై చాలా అంచనాలు నెలకొన్నాయి. కానీ గిల మాత్రం చాలా చెత్తగా ఆడి పెవిలియన్ చేరడం అందరినీ నిరుత్సాహపరిచింది.


**ఇషాన్ కిషన్**

విండీస్‌తో వన్డే సిరీసులో వరుసగా మూడు హాఫ్ సెంచరీలతో కిషన్ ఆకట్టుకున్నాడు. దీంతో టీ20 సిరీసులో కూడా అతను రాణిస్తాడని అంతా ఆశించారు. కానీ తొలి టీ20లో కిషన్ క్రీజులో చాలా ఇబ్బందిగా కనిపించాడు. తొమ్మిది బంతులు ఎదుర్కొన్న అతను కేవలం ఆరు పరుగులే చేసి పెవిలియన్ చేరాడు. ఇప్పటి వరకు భారత్ తరఫున పలు టీ20లు ఆడిన కిషన్.. ఈ ఫార్మాట్‌లో పెద్దగా ఆకట్టుకోలేదు. తన చివరి 15 టీ20 ఇన్నింగ్సుల్లో ఒక్క హాఫ్ సెంచరీ కూడా చేయలేదు. దీన్నిబట్టి చూస్తే.. కిషన్‌ను పొట్టి ఫార్మాట్‌లో పక్కన పెట్టడమే మంచిదని అనిపిస్తోంది.

**అక్షర్ పటేల్**

గతేడాది నుంచి మంచి ఫామ్‌లో కనిపించిన అక్షర్ పటేల్‌కు ఇటీవలి కాలంలో పెద్దగా అవకాశాలు దక్కలేదు. అయితే ఈ ఏడాది ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున నిలకడగా రాణించిన ఏకైక బ్యాటర్ అక్షర్ పటేల్ మాత్రమే కావడం గమనార్హం.

అయితే జడేజా రీఎంట్రీ తర్వాత టీమిండియాలో అతనికి అవకాశాలు దక్కలేదు. ఈ మ్యాచ్‌లో ఛాన్స్ దక్కడంతో అతను రాణిస్తాడని అంతా అనుకున్నారు. కానీ ఒత్తిడిని తట్టుకోలేక పోయిన అక్షర్ తేలిపోయాడు. బౌలింగ్‌లో కూడా పటేల్ పెద్దగా రాణంచకపోవడం గమనార్హం.



# సురేఖ త్రయం స్వర్ణ చరిత్ర

## వరల్డ్ ఆర్చరీ చాంపియన్‌షిప్స్

బెర్లిన్ (జర్మనీ): ఆంధ్రప్రదేశ్ స్టార్ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ త్రయం వరల్డ్ ఆర్చరీ చాంపియన్‌షిప్స చరిత్రలో భారత్‌కు తొలి స్వర్ణం అందించింది. ఇక్కడ జరుగు తున్న వరల్డ్ ఆర్చరీ చాంపియన్‌షిప్స ఒలింపిక్ ఈవెంట్స్‌లో నిరాశ పర్చిన భారత ఆర్చర్లు, నాన్ ఒలింపిక్ ఈవెంట్స్‌లో సత్తా చాటుతున్నారు. 1981నుంచి భారత క్రీడాకారులు ఈ వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో పాల్గొంటున్నా...స్వర్ణం మాత్రం అందు కోలేకపోయారు. శుక్రవారం జరిగిన కాంపౌండ్ టీమ్ ఈవెం ట్ ఫైనల్‌లో జ్యోతి సురేఖ, పర్ణీత్ కౌర్, అదితితో కూడిన భారత బృందం 235-229తో ఆంద్రియా, జియోన్, డాఫ్నె (మెక్సికో)పై నెగ్గి పసిడి పతకం కొల్లగొట్టింది.

కొలంబియా కాంస్యంతో సరిపెట్టుకుంది. మొత్తంగా జ్యోతిసురేఖకు వరల్డ్ ఆర్చరీ చాంపియన్‌షిప్స్‌లో ఇది ఏడో పతకం. శనివారం కాంపౌండ్ విభాగం వ్యక్తిగత పోటీల్లో జ్యోతి స్వర్ణమే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. ఇక, ఈ ఏడాది జరిగిన వరల్డ్‌కప్ స్టేజ్-1 పోటీల్లో వ్యక్తిగత విభాగంలో స్వర్ణం నెగ్గిన జ్యోతి, మిక్స్‌డ్ కాంపౌండ్ టీమ్ ఈవెంట్‌లోనూ పసిడి సాధించడం తెలిసిందే. వరల్డ్ చాంపియన్‌షిప్సలో దేశానికి తొలిస్వర్ణం అందించడం పట్ల జ్యోతి సురేఖ ఆనందం వ్యక్తంచేసింది. వ్యక్తిగత విభాగంలోనూ పసిడి సాధించడానికి కృషి చేస్తానని తెలిపింది.

# 1/15 భారత్

- 15 పెనాల్టీ కార్నర్లలో ఒక్కటే సఫలం
- జపాన్‌తో పోరు సమం
- ఆసియా చాంపియన్స్ ట్రోఫీ హాకీ



చెన్నై: చైనాతో ఆరంభ పోరులో ఏడింటికి ఏడు పెనాల్టీ కార్నర్లను గోల్స్‌గా మలిచి అదరగొట్టిన భారత్..రెండో మ్యాచ్ నాటికి మళ్లీ పాతబాటపట్టింది. ఒకటికాదు..రెండు కాదు ఏకంగా 15 పెనాల్టీ కార్నర్లు లభించినా కేవలం ఒక్కదాని మాత్రమే గోల్‌గా మలచగలిగింది. ఫలితం..జపాన్‌తో శుక్రవారం జరిగిన ఆసియా చాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌ను 1-1తో అతి కష్టంగా డ్రా చేసుకుంది. మరోవైపు జపాన్‌కు రెండు పెనాల్టీ కార్నర్లు లభించగా, ఒకదాన్ని గోల్‌గా మలిచింది. నగయోషి (28వ ని.) గోల్‌తో జపాన్‌ను ఆధిక్యంలో నిలపగా..కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ (43వ ని.) చేసిన గోల్‌తో స్కోరు సమమైంది. డ్రా దరిమిలా పాయింట్ల పట్టికలో భారత్ (4) రెండో స్థానంలో కొనసాగుతుండగా, మలేసియా (6) టాప్‌లో నిలిచింది. ఇక మ్యాచ్‌లకు శనివారం విశ్రాంతి. భారత జట్టు ఆదివారం మలేసియాను ఢీకొంటుంది. జపాన్‌తో పోరులో భారత్‌కు నాలుగో నిమిషంలోనే గోల్ చేసే అవకాశం లభించినా, జపాన్ కీపర్ టకాషీ అడ్డుకున్నాడు.

ఐదో నిమిషంలో లభించిన పీసీని హర్మన్‌ప్రీత్ గోల్‌గా చేయలేకపోగా..ఆపై స్వల్ప వ్యవధిలో వచ్చిన మరో మూడు పెనాల్టీ కార్నర్లను కూడా మనోళ్లు సద్వినియోగం చేసుకోలేక పోయారు. మొత్తంగా తొలి క్వార్టర్‌లో భారత్‌కు ఎనిమిది పీసీలు దక్కడం గమనార్హం. మొదటి క్వార్టర్ 0-0తో ముగియగా..రెండో క్వార్టర్ ఆరంభంలోనే భారత్‌కు వచ్చిన ఫీల్డ్ గోల్ అవకాశాన్ని జపాన్ కీపర్ వమ్ము చేశాడు. ఇక..28వ నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను నగయోషి..కీపర్ శ్రీజేషకు అందకుండా గోల్‌గా మలచడంతో ప్రథమార్ధానికి జపాన్ 1-0 ఆధిక్యం ప్రదర్శించింది. మూడో క్వార్టర్‌లో లభించిన పదో పెనాల్టీ కార్నర్‌ను కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ ఎట్టకేలకు గోల్ చేయడంతో మనోళ్లు 1-1తో సమం చేయగలిగారు. చివరి క్వార్టర్‌లో రెండు జట్లు గోల్స్ చేసేందుకు తీవ్రంగా ప్రయత్నించినా సఫలం కాలేకపోయాయి. శుక్రవారం జరిగిన ఇతర మ్యాచ్‌ల్లో..డిఫెండింగ్ చాంపియన్ కొరియా-పాకిస్థాన్ పోరు 1-1తో డ్రాగా ముగిసింది. మరో మ్యాచ్‌లో మలేసియా 5-1 స్కోరుతో చైనాను చిత్తు చేసింది.

# కొల్లాపూర్ నియోజక వర్గంలో పోలీస్ రాజ్యం

- దళితుల మీద దాడులకు ఎమ్మెల్యే నైతిక బాధ్యత వహించాలి
- మైలారం సర్పంచ్ మీద దాడి చేసిన కొడేర్ ఎస్ఐ మీద అట్రాసిటీ కేసు నమోదు చేయాలి
- ఈ నెల 9 న కొల్లాపూర్ కు మంద కృష్ణమాదిగ రాక
- అప్పటి లోపు తేల్చకుంటే ఎమ్మెల్యే రాజకీయ మూల్యం చెల్లించు కావాల్సి వస్తుంది
- యాదగిరి మాదిగ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి



**కొల్లాపూర్ ,(సమ సమాజం):** కొల్లాపూర్ నియోజక వర్గంలో పోలీసు రాజ్యం నడుస్తుందని, ఈ రాజ్యం ఎమ్మెల్యే కన్నుసన్నల్లో నడుస్తుందని అఖిల పక్ష సంఘాలు గా ఆరోపిస్తున్నాయి. కోడేరు మండలం మైలారం గ్రామం దళిత సర్పంచ్ మీద అకారణంగా దాడి చేసి, కులం పేరుతో అవమానపరిచిన ఎస్సైని తక్షణమే సస్పెండ్ చేయాలని, అతనిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సర్పంచ్ మీద జరిగిన దాడిని ప్రజాస్వామ్యంగా ఖండించిన వారిపైన అక్రమ కేసు నమోదు చేసిన పోలీసులు, అదే పోలీసుల మీద కేసు నమోదు చేయమని ఫిర్యాదు ఇస్తే చేయకపోవడం దుర్మార్గమైన విషయమని, పోలీసులే ఫిర్యాదుదారులుగా మారడం తెలంగాణలో కొత్త సంస్కృతిగా మారిందని, ఈ సంస్కృతి చివరకు పోలీసు వ్యవస్థను ప్రజల నుండి దూరం చేస్తుందని గుర్తు చేశారు. నియోజకవర్గంలో దళితుల మీద దాడులు నిత్య కృత్యంగా మారాయని, దళిత నాయకులు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు ఇవ్వడానికి వెళ్తే కనీస మర్యాదలు కూడా పాటించకుండా పోలీస్ స్టేషన్లో పోలీసులే నిర్వహిస్తున్నట్టుగా వారి సొంత జాగీర్లుగా వ్యవహరిస్తున్నారని, దీనికంతటికి కారణం పోలీసుల వెనుక రాజకీయ కారణంగా భావిస్తున్నామన్నారు. జిల్లా ఉన్నతాధికారులకు నియోజకవర్గ పోలీసుల అహంకార వైఖరి మీద ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం, వారి అరాచకాలకు అడ్డు అదుపు లేకుండా పోతుందని, తక్షణమే ఇకనైనా మేల్కొని జిల్లా పోలీసు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కోడేరు ఎస్సైని తక్షణమే బదిలీ చేయాలని, అతనిపై చట్ట ప్రకారం కేసు నమోదు చేయాలని, ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలని, లేని ఎడల దళితుల మీద దాడులకు ఎమ్మెల్యే నే ప్రోత్సహిస్తున్నారని భావించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ తాలూకా ఇంచార్జ్ డాక్టర్ పరిటాల శ్రీనివాస్, టిపిసిసి రాష్ట్ర మహిళా కార్యదర్శి కాటమోని తిరుపతమ్మ, తెలంగాణ దళిత దండు వ్యవస్థాపక అధ్యక్షులు బచ్చల కుల బాలరాజ్, టిఎంఆర్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మీసాల రాము, మాల మహానాడు స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాందాస్, ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా ఇంచార్జ్ జంగయ్య, జిల్లా ఇంచార్జ్ బకరం శీను, అగ్ర స్వామి, వడ్డేమాన్ రాముడు, పసుపుల కృష్ణ, బుడగ జంగాల రాష్ట్ర అధ్యక్షులు కోడిగంటి నరసింహ, కృష్ణయ్య, వాల్మీకి సంఘం తాలూకా అధ్యక్షులు పరశు రాం, వెంకటేష్ నాయుడు, బి ఎస్ పి ఈ సి మెంబర్ శేఖర్, గౌడ సంఘం తాలూకా అధ్యక్షులు యదన్న గౌడ్, సింగోటం సర్పంచి మాండ్ల కృష్ణ , మాజీ సర్పంచ్లు ఎత్తం కృష్ణ, వెంకటస్వామి, జనసేన తాలుక కోఆర్డినేటర్ బైరపోగు సాంబశివుడు, ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షులు ఆదిరాల అన్వేష్ గౌడ్, దళిత నాయకులు సోమ నాథ్, కొమ్ము దానయ్య, యపచేటు లాల్, టీడీపీ రామస్వామి, తదితరులు దళిత సర్పంచ్ పై జరిగిన దాడిని ఖండిస్తు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్, ఎంఎస్పి జిల్లా, తాలుక నాయకులు, వివిధ సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలో నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కేసీఆర్ భూదాహానికి పేదలు బలైపోతున్నారు: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్



**హైదరాబాద్, (సమ సమాజం):** ముఖ్యమంత్రి కేసీఆర్,మంత్రి కేటీఆర్ భూదాహానికి పేద రైతులు బలైపోతున్నారని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ ధ్వజమెత్తారు.జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం శాంతినగర్ లో బుద్వేల్ అసైండ్ భూముల్లో నిర్వహించే వేలంపై వీడియో సందేశం ద్వారా పత్రికా ప్రకటన విడుదల చేసిన అనంతరం ట్విట్టర్ వేదికగా స్పందించారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో భూ దాహం తీరడం లేదని,పేద రైతుల నోట్లో ప్రభుత్వం మట్టి కొడుతుందని మండిపడ్డారు.కేసీఆర్ పాలనలో తెలంగాణలో పేద ప్రజలకు చివరకు గోచి గుడ్డ కూడా మిగిలే పరిస్థితి లేదన్నారు. పేదల అసైండ్ భూములను బలవంతంగా లాక్కొని,వేలం వేసి అపర కుబేరులకు ధారాదత్తం చేయడం దుర్మార్గమన్నారు.పేద రైతుల నుంచి ఇప్పటికే ప్రభుత్వం 30 వేల ఎకరాలు అసైండ్ భూములను బలవంతంగా లాక్కుందన్నారు. దీన్ని బట్టి కేసీఆర్ భూదాహం రాష్ట్రంలో పరాకాష్టకు చేరిందన్నారు. బుద్వేల్ లో సర్వే నెంబర్ 282, 299 లో 255 ఎకరాల అసైండ్ భూములను ప్రభుత్వం కుట్రపూరితంగా హెచ్ఎండిఎ, రంగారెడ్డి జిల్లా కలెక్టర్,టూరిజం డిపార్ట్మెంట్ ప్రయివేట్ వ్యక్తులతో కలిసి బలవంతంగా గుంజుకున్నవేనని ఆరోపించారు.ఆ అసైండ్ భూముల్లో ప్రభుత్వం వేలం వేయడం అన్యాయమన్నారు.గత నెలలో భూముల అక్రమాలపై తమ పార్టీ మీడియా ముందు ఆధారాలతో సహా బయట పెట్టిందన్నారు. పేద రైతుల వద్ద అసైండ్ భూమి ఉంటే ధరణి పోర్టల్ లో నిషేధిత జాబితాలో పెడుతున్న ప్రభుత్వం, అవే భూములను ప్రభుత్వం బలవంతంగా గుంజుకొని,వందల కోట్లకు వేలం వేసి ప్రయివేట్ కంపెనీలకు కట్టబెట్టడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా అసైన్డ్ భూములకు హక్కు పత్రాలు ఇవ్వాల్సింది పోయి,దేశంలో ఎక్కడా లేని విధంగా కేసీఆర్ ప్రభుత్వం అసైండ్ భూములను బహిరంగంగా వేలం వేయడం దుర్మార్గమన్నారు. పేద రైతులను కేసీఆర్ ప్రభుత్వం మభ్యపెట్టి,భయపెట్టి వాళ్లకు 500 గజాల జాగా బిచ్చ వేయడం అనైతికం, చట్టవిరుద్ధమన్నారు. అసైండ్ భూముల వేలంలో వచ్చే ప్రతి పైసా కూడా భూమి హక్కుదారులకే చెందుతాయన్నారు.అసైండ్ భూములను వేలంలో వందల కోట్లు గుమ్మరించి కొంటున్న కేసీఆర్, కేటీఆర్ బినామీలను హెచ్చరించారు.త్వరలో రాబోయే బహుజన రాజ్యంలో చట్టవిరుద్దంగా వేలం వేసిన అసైండ్ భూములతోపాటు కోకాపేటలో అక్రమంగా బిఆర్ఎస్ కు కేటాయించిన 13 ఎకరాలతో భూములను స్వాధీనం చేసుకొని, తిరిగి పేద రైతులకు పంచుతామన్నారు.

# కాపాడే వారే కబ్జాలకు పాల్పడుతున్నారు

**చౌటుప్పల్ ,(సమ సమాజం):** ప్రభుత్వ, ప్రజల ఆస్తులను, భూములను కాపాడవలసిన వారే కబ్జాలకు పాల్పడుతున్నారని, చౌటుప్పల్ మండలం మల్కాపురం రెవెన్యూ పరిధి లో ఉన్న కాందిషికుల 401 ఎకరాల భూమినీ అన్యాక్రాంతం కాకుండా చూసే బాధ్యత ప్రభుత్యం పై ఉందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మునుగోడు నియోజకవర్గ ఇంచార్జి జక్కలి ఐలయ్య యాదవ్ అన్నారు. చౌటుప్పల్ మండలం మల్కాపూర్ లోని వివాదాస్పదమైన కాంధిశికుల భూములను టిడిపి స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. అక్కడ ఉన్న గ్రామ ప్రజలతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఐలయ్య యాదవ్ మాట్లాడుతూ మల్కాపురం లోని సర్వే నెంబర్ 115.123.137.141.267 నెంబర్లలో 401 ఏకరాల కాంధీశికుల భూమిని ప్రభుత్వం కేటాయించిన మహారాష్ట్రకు చెందిన వారు 70 సంవత్సరాలుగా ఇక్కడికి రాలేదని, ఇప్పుడు మేమే వారసులమని వచ్చిన వారికి నిర్ధారణ కాకుండానే భూములను కట్టబెట్టేందుకు అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధులు ప్రయత్నం చేస్తున్నారనే వార్తలపై మండిపడ్డారు. నిషేధిత జాబితాలో ఉన్న ఈ భూమి ని తొలగించి అక్రమంగా స్వాధీనం చేసుకోవడం కోసం జిల్లా మంత్రి, ఎమ్మెల్యేలు ప్రయత్నం చేస్తున్నారని వార్తలపై వారు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ భూములను కాపాడడానికి ప్రయత్నం చేస్తున్న జిల్లా కలెక్టర్ ను బదిలీ చేశారనే విమర్శలపై స్పందించాలని కోరారు. మునుగోడు ఉప ఎన్నికల్లో అధికార పార్టీకి అనుకూలంగా వ్యవరిస్తున్నారనే ఆరోపణతో ఎన్నికల విధుల నుండి తప్పించిన అధికారిని ఆర్డిఓ గా పోస్టింగ్ ఇవ్వడం, కలెక్టర్ ను బదిలీ చేయడం తో ఈ భూములను ఖాచేయడం కోసమనే ఆరోపణలకు బలం చేకూరిందన్నారు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in